# ఫలితం ప్రధానం!

- నెమలూరి భాస్కరరావు.

'ఈ రాత్రి ఆయన గెస్ట్‌హౌస్‌లో వుంటాడు. నిన్ను ఇప్పుడు ఆయన వద్దకు తీసుకువెళ్లి వదిలి వస్తాను. తిరిగి తెల్లవారు ఝామున ఐదు గంటలకు నేను వచ్చి నిన్ను పికప్ చేసుకుని నీ ఇంటి దగ్గర దింపుతాను. ఈలోగా నువ్వు చేయాల్సిన పనేమిటంటే, రాత్రంతా ఆయన్ని ఆనందింపజెయ్యాలి. దాని ఖరీదు రెండు వేల రూపాయలు. ఇవిగో అడ్వాన్స్‌గా తీసుకో. దీని కన్నా ముఖ్యమైన పని ఈ రాత్రికే నువ్వు చేయాల్సింది మరొకటుంది- ఆ పని నువ్వు విజయవంతంగా చెయ్యగలిగితే, రేపు ఉదయాన్నే నిన్ను పికప్ చేసుకోవటానికి వచ్చినప్పుడు మరో పదివేల రూపాయలు స్పాట్ క్యాష్ ఇచ్చి నిన్ను మీ ఇంటి దగ్గర దింపుతాను. ఆ పని ఏమిటంటే, ఈ రాత్రికి ఆయనచేత బాగా త్రాగించు. ఈ కాగితాల మీద ఆయన చేత రెండు సంతకాలు చేయించు. ఆ పని చేయించావా... నీ అదృష్టం పండినట్లే. కాగితాలు నా చేతిలో, పదివేల రూపాయలు నీ చేతిలో. ఇంతకూ ఆయనెవరో చెప్పలేదు కదూ! ఆయనో పెద్ద ఇంజనీరు. నేనో పెద్ద కాంట్రాక్టర్‌ని. ఆ కాగితాల మీద ఆయన సంతకాలు చేస్తే నాకో పెద్ద కాంట్రాక్టు వస్తుంది. నీకు పదివేల రూపాయలు వస్తాయి. ఇదిగో రాయల్ ఛాలెంజ్ ఫుల్ బాటిల్. నువ్వు త్రాగొద్దు. ఆయనచేత త్రాగించు. లేటవుతోంది. ఇంక బయలుదేరు" అంటూ ఆ కాంట్రాక్టర్ కారు డోర్ తెరిచాడు. ఆ కాల్‌గర్ల్ రెండు వేల రూపాయలూ, కాగితాలూ, రాయల్ ఛాలెంజ్ ఫుల్ బాటిలూ తన వ్యానిటీ బ్యాగ్‌లో సర్దుకుని, వయ్యారంగా కారెక్కి కూర్చుంది. కారు ఆ గొప్ప చీఫ్ ఇంజనీరు గారు బసచేసి వున్న గెస్ట్‌హౌస్ వైపు సాగిపోయింది.

తెల్లవారుఝామున ఐదు గంటలప్పుడు ఆ కాంట్రాక్టర్ గెస్ట్‌హౌస్ ముందు కారు ఆపి రెండుసార్లు హారన్ మ్రోగించాడు. ఆ కాల్‌గర్ల్ జుట్టు సరిచేసుకుంటూ, వ్యానిటీ బ్యాగ్ చంకన తగిలించుకుని, గెస్ట్‌హౌస్‌లోంచి బైటకు వచ్చి కారులో ఎక్కి కూర్చుంది.

'సంతకాలు చేయించావా?' అన్నాడు ఆతృతగా.

'నా సత్తా నీకు తెలిసినట్లు లేదు' అన్నట్లు అతనివైపో చూపు చూసి, బ్యాగ్‌లో వున్న కాగితాలు తీసి కాంట్రాక్టరు చేతిలో పెట్టిందామె. కాంట్రాక్టరు ఆ కాగితాలు పరీక్షగా పరిశీలించి చూశాడు-

అతని ముఖంలో వెయ్యి వోల్టుల బల్బు కాంతి!

'ఇదిగో... అనుకున్న ప్రకారం నీ పదివేలూ తీసుకో...' అంటూ పదివేల కట్ట ఆమె చేతికి అందించాడు అతను.

ఆమె కళ్లు ఆనందంతో చెమర్చాయి.

'ఈ పదివేలతో అమ్మకు ఆపరేషన్ చేయించాలి' అనుకుంది ఆమె మనసులో.

'ఈ కాంట్రాక్టు ద్వారా తనకు నాలుగైదు లక్షలు మిగుల్తాయి. ఈ రాబడిలో ఓ లక్ష ఖర్చుచేసి కార్పోరేటర్‌గా పోటీచేసి గెలవాలి. ఆ విధంగా కార్పోరేషన్ కాంట్రాక్టులు పట్టేయాలి' అనుకున్నాడు కాంట్రాక్టర్ ఆనందంగా.

'చూడు తమ్ముడూ! నువ్వీ వూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయి రావటం నిజంగా మా అదృష్టం. నువ్వు ఒక్క సహాయం చేసి పెట్టాలి. నీ మేనల్లుడికి క్రిందటేడు పెళ్లి చేశాను గుర్తుంది కదా! వాడు ఆ పిల్లతో సుఖపడలేకపోతున్నాడు. ఆ పిల్లతో కాపురం చేయలేనంటున్నాడు. వాడు పనిచేస్తున్న ఆఫీసులోనే ఓ పిల్ల వుందట. ఆ పిల్లను ప్రేమించాడట. ఆ అమ్మాయికి నెలకు పదివేలు జీతం వస్తుందట. ఇప్పుడున్న దాన్ని వదిలించుకుంటే అది మనవాడ్ని పెళ్లి చేసుకుంటానంటోందిట. పైగా నాలుగు లక్షలు కట్నంగా డబ్బు కూడా తెస్తుందట. గ్యాస్ స్టవ్

ముందే ఆన్‌చేసి వుంచి, దానిచేత ముట్టించేలా చేస్తాం. అది అంటుకుని హరీ అంటుంది. ప్రమాదవశాత్తూ చనిపోయినట్లు కేసు లేకుండా నువ్వు సహాయపడాలి. నీ రుణం వుంచుకోను. ఒక తల్లి పిల్లలం కాకపోయినా, అక్కాచెల్లెళ్ల పిల్లలం మనం. అందువల్ల మనం రక్తసంబంధీకులం. నేను ఇప్పటిదాకా నిన్నేం కోరలేదు. ఇది కూడా నువ్వు చెయ్యలేని పనేం కాదు. నీ చేతిలో పనే. నాకు తోడబుట్టిన అన్నదమ్ములెవరూ లేరు నువ్వు తప్ప. ఈ ఒక్క సహాయం చేసిపెట్టు. పని పూర్తికాగానే ఓ లక్ష రూపాయలు ఇస్తాను. లంచం కాదు సుమా! నా సంతోషం కోసం మాత్రమే. బహుమానం అనుకో' అంది ఆమె.

ఆమె పుత్రరత్నం పోలీస్ మావయ్య ఏం అంటాడా అని ఆత్రంగా ఎదురుచూస్తున్నాడు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి తన భారీకాయాన్ని కుర్చీలో కొద్దిగా కదిపి, విశ్రాంతిగా సర్దుకుని కూర్చున్నాడు. అతని ముఖంలో ఆనందం తాండవిస్తోంది. అతని కొడుకుని వచ్చే నెలలో మెడిసిన్‌లో చేర్చాలి. లక్ష రూపాయలు అందుకోసం అవసరం. ఆ సమస్య ఈ విధంగా పరిష్కారం అవుతున్నందుకు లోలోన సంతోషిస్తూ–

'నువ్వు అంతగా అడగాలా అక్కయ్యా! ఆ మాత్రం ఒకరికొకరు సహాయపడకపోతే ఇంక బంధుత్వాలకు అర్థమేముంటుంది. తప్పనిసరిగా చేస్తాను' అంటూ ఆ కార్యక్రమాన్ని వాళ్లెలా ప్లాన్ చెయ్యాలో వివరంగా ఆవిడకు బోధపరిచాడు సత్యమూర్తి.

మూడు రోజుల తర్వాత ఆ కోడలుపిల్ల గ్యాస్ స్టవ్ ప్రమాదంలో మతాబాలా కాలి చనిపోయింది. ఓ వారానికల్లా కేసూ గట్రా లేకుండా అంతా సవ్యంగా జరిపించాడు సత్యమూర్తి. అనుకున్న ప్రకారం అతని అక్కగారు సత్యమూర్తికి లక్ష రూపాయలు పువ్వుల్లో పెట్టి సమర్పించింది. ఆ డబ్బుతో సత్యమూర్తి తన కొడుకుని ప్రజలకు ప్రాణాలు పోసే వైద్య విద్యలో చేర్పించాడు. మరో నాలుగు నెలల్లో సత్యమూర్తి మేనల్లుడు పాత పెళ్లాం స్థానంలో మరో అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడు. ఆ పిల్ల నాలుగు లక్షల కట్నం సొమ్ము, నెలకు పదివేల జీతంతో ఉద్యోగం చేస్తూ రంగ రంగ వైభోగంగా అత్తగారింట అడుగుపెట్టింది.

'ఇప్పటికి మూడుసార్లుగా నేనే ఆ నియోజకవర్గానికి యం.యల్.ఏ.ని. అయితే ఈసారి నాకు ఒకడు పోటీ తగుల్తున్నాడు. పార్టీ అధిష్ఠానం కూడా నా బదులు వాడికే టికెట్ ఇవ్వడానికి అనుకూలత చూపిస్తోంది. వాడు పెద్ద బ్రాందీ కింగు. అపారంగా ఆ వ్యాపారంలో సంపాదించాడు. పార్టీకి పది లక్షలు డొనేషన్ ఇచ్చాడు. పార్టీలో నాకు వ్యతిరేకంగా ఒక వర్గం వుంది. వాళ్లిప్పుడు నా బదులు ఆ బ్రాందీ కింగుకి టికెట్ ఇవ్వాలని మంతనాలు జరుపుతున్నారు. అధిష్ఠానం కూడా దానికి అంగీకరించే లాగానే కనిపిస్తోంది. నాకు తప్ప వేరేవాడికి టికెట్ రాకూడదు. అంటే ఆ బ్రాందీ కింగుగాడిని లేపెయ్యాలి. పదిహేను లక్షలిస్తాను. పని నాలుగైదు రోజుల్లో అయిపోవాలి. ఇదిగో అయిదు లక్షలు అడ్వాన్స్. పని పూర్తి అవగానే మిగతా పది లక్షలూ ఇస్తాను' అన్నాడు యం.యల్.ఏ. నాయుడు.

'ఓసింతేనా! ఆ డబ్బు అక్కడ పెట్టి పో. నాలుగు రోజుల్లో స్పాట్ పెడతాను' అన్నాడు గడ్డం శీను ఉరఫ్ కార్పొరేషన్ స్థాయి రాజకీయ దాదా.

నాలుగు రోజుల తర్వాత ఓ రోజు ఉదయం నగరంలో పెద్ద సంచలనం. బ్రాందీ కింగ్ బాబూరావ్ హత్య చేయబడ్డాడు. హంతకులెవరో తెలియలేదు. హతుడి అనుచరులు ఊళ్లోని చాలా షాపుల్ని ఆగ్రహంతో లూటీ చేశారు. కొన్నింటిని తగులబెట్టారు. కొన్నిటిని పగులగొట్టారు. అంతటా హింసాకాండ – విధ్వంసం – దహనాలు – లూటీలు – బంద్‌లు. 'గాంధీ గారిని చంపినప్పుడు కూడా ఇంతటి విధ్వంసం జరగలేదు' అన్నాడొక శతాధిక వృద్ధుడు.

'అప్పుడు చనిపోయింది ఓ అహింసావాది కనుక ఇంతటి విధ్వంసం ఎలా జరుగుతుంది?' అన్నారు మరొకరు. పార్టీ అధిష్ఠానం నగరంలోని కొందరు పెద్దలతో ఓ శాంతి సంఘాన్ని ఏర్పాటు చేసింది. దానికి నాయకుడుగా యం.యల్.ఏ.

నాయుడు నియమించబడ్డాడు. బాబూరావ్ చాలా గొప్ప వ్యక్తి అనీ, అలాంటి వాణ్ణి కోల్పోవటం దేశం దురదృష్టమనీ, అతను లేని లోటు పూడ్చరానిదనీ శాంతి సంఘం-పార్టీ అధిష్ఠానం కలిసి ఓ తీర్మానం చేశారు. బ్రాందీ కింగు బాబూరావ్ అంత్యక్రియలు పెద్ద ఊరేగింపుతో ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా యం.యల్.ఏ. నాయుడు జనం ముందు వెక్కివెక్కి ఏడ్చాడు. తన వారసుడ్ని కోల్పోయానని వాపోయాడు. ఆ తర్వాత కొద్దిరోజులకే పార్టీ అధిష్ఠానం యం.యల్.ఏ. నాయుడికే ఆ నియోజకవర్గానికి టికెట్ ఇచ్చింది. ఎన్నికల్లో నాయుడు రిగ్గింగూ, సారా-డబ్బు పంచడంతోపాటు కొంచెం ప్రజాస్వామ్యాన్ని కూడా కలిపి అఖండ మెజారిటీతో గెలుపొందాడు. ఈసారి అతనికి మంత్రివర్గంలో కూడా చోటు లభించింది. హోంశాఖను అతనికి కేటాయించారు. హోం మినిస్టర్ నాయుడు ముందుగా గెడ్డం శీను దాదాను కలుసుకున్నాడు. అతనికి ఇస్తానన్న పది లక్షలూ పువ్వుల్లో పెట్టి ఇచ్చాడు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో శీను దాదాను కార్పోరేషన్‌కి మేయర్ని చేస్తానని హామీ కూడా ఇచ్చి, నేరుగా తిరుపతి వెంకన్న స్వామి దర్శనానికి వెళ్లాడు. స్వామికి తలనీలాలు అర్పించాడు. స్వామివారి హుండీలో భారీ మొత్తంలో కానుకలు సమర్పించుకున్నాడు. 'స్వామీ! ఈ నా మంత్రి పదవీకాలంలో కోట్ల సంపాదనను ప్రసాదించు. అందులో నీకు పావలా వాటాతో స్వర్ణాభరణాలు చేయించి అలంకరిస్తాను' అని మొక్కుకున్నాడు.

'నాయనా! పై మూడు సంఘటనలూ విన్నావు కదా! వాటన్నిటిలోని సారం ఏమిటి? వాటి నుంచి మనం ఏం గుణపాఠం నేర్చుకోవాలి?' అని స్వామి లౌకికానంద స్వామి తన శిష్యుడైన జ్ఞానేంద్రను అడిగారు.

'ఏముంది స్వామీ! సమాజం అంతా కుళ్లిపోయింది. అవినీతిమయం అయిపోయింది. ఈ అవినీతిని వదులుకోమని తమలాంటి స్వాములు ప్రజల్ని జాగృతం చెయ్యాలి' అన్నాడు శిష్యుడు జ్ఞానేంద్ర.

లౌకికానంద స్వామి చిరునవ్వు నవ్వారు.

ఆ నవ్వులో 'అజ్ఞానీ' అన్న భావం కన్పించింది శిష్యుడు జ్ఞానేంద్రకు. గురువుగారు ఏం చెబుతారా అని అతను ఆసక్తిగా చెవులు అప్పగించుకుని వున్నాడు. 'చూడు నాయనా! కాలాన్ని బట్టి మన అవగాహన, విశ్లేషణా జ్ఞానం మారుతుండాలి. వైదికకాలం నాటి సూక్తులే వల్లిస్తుంటే మనల్నెవరూ గుర్తించరు. మనల్ని గుర్తిస్తే తప్ప మనం సమాజాన్ని మార్చలేం. అందువల్ల పరిస్థితులకు అనుగుణంగా మనమూ మారాలి. ఈవేళ సమాజ నీతికి పై మూడు సంఘటనలూ అద్దం పడుతున్నాయి. వ్యక్తిగత సుగుణాలూ- ఔన్నత్యం- క్యారెక్టరూ ఇవేమీ ముఖ్యం కాదు. ఎలా సంపాదించాడు అన్నది ముఖ్యం కాదు. ఎంత సంపాదించాడు అన్నదే ముఖ్యం. సామాన్య మానవుల నుంచి స్వామీజీల వరకు గౌరవం సంపాదనను బట్టే వుంటోంది. కాబట్టి రేపట్నించి పాదపూజకు పదివేలు, భిక్షకు 50 వేలు వసూలు చెయ్యి. అప్పుడే మనకు పాపులారిటీ, ప్రతిష్ఠ పెరుగుతాయి. డబ్బు లేకుండా మనం ప్రజలకు ఏమీ మేలు చెయ్యలేం' అన్నారు లౌకికానందస్వామి.

'అలాగే స్వామీ!' అన్నాడు శిష్యుడు జ్ఞానేంద్ర తన అజ్ఞానానికి చింతిస్తూ.

❑

## కావ్! కావ్!!

మోసాలకి చమురు
మీసాలను నిమురు
మనగలవ్- లేవు నీకిక క్లేశాలు!
నిగనగలాడుతుంటాయ్
చూసుకో అద్దంలో- నీ ధనకేశాలు!

కాకా పట్టడం అభ్యసిస్తే
డోకాలేదిక మెతుక్కి!
బాకాలూదడం ప్రారంభిస్తే
బాకీలుండవిక బతుక్కి!

-వారణాసి రామకృష్ణ